రామడుగు బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో..

- ఐదు సంవత్సరాల క్రితం పనులకు శ్రీకారం
- పూర్తయిన 90 శాతం నిర్మాణ పనులు
- లోలెవల్ వంతెనతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


అసంపూర్తిగా రామడుగు హైలెవల్ బ్రిడ్జి

రామడుగు: రామడుగు సమీపాన మోతె వాగుపై రామడుగు, షానగర్ గ్రామాల మధ్య ఐదు సంవత్సరాల క్రితం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అసంపూర్తి పనులతో నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు నిత్యం లోలెవల్ వంతెనపై నుంచి ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి.

రూ.7.90కోట్ల నిధులతో..

రాష్ట్ర ప్రభుత్వం రామడుగు గ్రామ సమీపాన రామడుగు, షానగర్ గ్రామాల మధ్య ఉన్న మోతె వాగుపైన హైలెవల్ వంతెన నిర్మాణం కోసం రూ.7.90కోట్ల నిధులు మంజూరు చేసింది. అప్పటి చొప్పదండి శాసన సభ్యుడు సుంకె రవిశంకర్ 2019 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

ఐదు మండలాలకు..

కరీంనగర్ నుంచి రామడుగు ద్వారా జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి, గొల్లపల్లి, చొప్పదండి మండలాలతోపాటు గంగాధర, మల్యాల మండలాలు, మరికొన్ని మండలాల్లోని గ్రామాలకు ఈ ప్రధాన రహదారి ద్వారానే నిత్యం ప్రయాణికులు ప్రయాణం చేస్తారు. రామడుగు వద్ద ఉన్న మోతె వాగుపై ఉన్న లోలెవల్ వంతెనతో నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. రెండు సంవత్సరాలు కురిసిన భారీ వర్షాలతో లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రమాదకరంగా ప్రవహించడంతో.. రెండు రోజులపాటు వాహనాల రాకపోకలు నిలిచి ప్రయాణికులు తిప్పలు పడ్డారు. ఇరువైపులా గండి పడడంతో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించి వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

90 శాతం..

వంతెన పనులు దాదాపు 90 శాతం పూర్తి చేశారు. మిగతా కొంతభాగం పనులు పూర్తి కాకపోవడంతో.. ఈ వంతెన అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. వంతెన నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సమస్య రావడంతో పనులు నిలిచాయని అధికారులు తెలిపారు. అవసరమైన భూ మిని సేకరించేందుకు రామడుగులో భూసేకరణ గ్రామసభను కూడా రెవెన్యూ అధికారులు గతంలో నిర్వహించి ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. షానగర్ గ్రామ పరిధిలో 1.16ఎకరాలు, రామడుగు గ్రామ పరిధిలో 0.33ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. గతేడాది వర్షాకాలంలో భారీగా వర్షాలు కురవడంతో పాత వంతెనపై నుంచి నీరు భారీగా ప్రవహించడంతో.. వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి కలెక్టర్, ఎమ్మెల్యే రవిశంకర్ వాగు పరిస్థితిని పరిశీలించి తక్షణం పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారు పరిశీలించి ఏడాది గడుస్తున్నా.. నేటికీ పనులు పూర్తి కాలేదు. పాత వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. దీనిపై రంధ్రాలు పడడంతో గతేడాది అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తాత్కాలిక మట్టి పోసి వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదకరంగా ఉంది



పాత వంతెన చాలా ప్రమాదకరంగా ఉంది. ప్రయాణికులు చాలా ఇబ్బందికరంగా ప్రయాణం చేస్తున్నరు. తాత్కాలికంగా మరమ్మతులు చేసినా పాడైపోతంది. అధికారులు చొరవ తీసుకొని త్వరగా పనులు పూర్తి చేయాలి.

– పంజాల ప్రమీల, మాజీ సర్పంచ్, రామడుగు

పనులు త్వరగా పూర్తి చేయాలి



గత ప్రభుత్వం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి దాదాపు ఐదు సంవత్సరాలు గడుస్తున్నా.. అధికారులు పనులు పూర్తి చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల అవస్థలు పడ్డారు. అధికారులు ఇప్పటికైనా వంతెన సమస్యను పరిష్కరించాలి.

– వీర్ల వెంకటేశ్వర్‌రావు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్



మత్తడి దూకుతున్న ముత్తారం చెరువు

శంకరపట్నం: ముత్తారం రామసముద్రం చెరువు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ముత్తారం చెరువులో చేరడంతో.. చెరువు నిండి మత్తడి దూకింది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

చొప్పదండి: పచ్చదనం, పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాఠశాలలో శనివారం పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు. వివిధ పండ్లు, చెట్ల రూపాలను ప్రదర్శించి వాటి ప్రాధాన్యం వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి


మాట్లాడుతున్న బోయిని అశోక్

శంకరపట్నం: పంట రుణం తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ డిమాండ్ చేశారు. కేశవపట్నంలో శనివారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రుణమాఫీ కాలేదని కొంతమంది రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈనెల 25న కరీంనగర్‌లో జరిగే రాజకీయ శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు. మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, తిరుపతి, దేవయ్య, రవి, లక్ష్మణ్, వెంకటయ్య, సంపత్, బాదుల్లా, ఓదయ్య, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్ చేస్తున్న ప్రిన్సిపాల్

మానకొండూర్: పోచంపల్లి మోడల్ స్కూల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ కిరణ్ వైద్య బృందం సీపీఆర్‌పై శనివారం అవగాహన కల్పించారు. గుండెకు సంబంధించిన అనేక విషయాలను చెప్పారు. హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్సపై వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎం అర్చనాప్రియదర్శిని, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ముద్దసానికి నివాళి

శంకరపట్నం: కేశవపట్నంలో శనివారం మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆరీఫ్, గోపీవీరమల్లు, శ్రీనివాస్, మధూకర్, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


నోట్ పుస్తకాలు అందిస్తున్న మాజీ ఎంపీపీ హరీశ్

రామడుగు: వన్నారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కరీంనగర్‌కు చెందిన దాత గాజుల శ్రీనివాస్ నోట్ పుస్తకాలను పంపించగా.. శనివారం మాజీ ఎంపీపీ జవ్వాజీ హరీశ్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరాజం, కార్యదర్శి నవిత, నాయకులు ఓంప్రకాశ్, గుత్తురి శ్రీనివాస్, రెండ్ల మల్లేశం, భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

మానకొండూర్: రైతులకు రుణమాఫీ చేయడంతో ఖాదర్‌గూడెం గ్రామంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ చంటి చంద్రయ్య, వంగ రాయమల్లు, గాలి కొమురయ్య, ఆకునూరి మల్లయ్య, జిల్లెల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల బారి నుంచి రక్షించాలి

సైదాపూర్: రాములపల్లిలో పిచ్చి కుక్కల బారి నుంచి రక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. రాములపల్లిలో సుమారు 30 వరకు ఊర కుక్కలున్నాయని, అందులో పిచ్చి కుక్కలు, రోగాల బారిన పడిన కుక్కలు ఉన్నాయన్నారు. మనుషులు, పశువులను కరుస్తున్నాయని, కుక్కల భయానికి బయటికి రావడానికి గ్రామస్తులు జంకుతున్నారని వాపోయారు.

మార్కెట్ రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే

చొప్పదండి: వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చి వెనకబడిన వర్గాలు, బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దేనని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరెళ్ళి చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒక వర్గానికే పరిమితమైన మార్కెట్ పదవుల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. చొప్పదండి మార్కెట్ పీఠంపై దళితుడికి అవకాశం రావడం బీఆర్‌ఎస్ ఘనతేనని అన్నారు.

ఆకట్టుకున్న గోరింటాకు వేడుకలు



హుజూరాబాద్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయ ఆవరణలో ఆర్యవైశ్య స్వచ్ఛంద సంస్థ మహిళలు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం గోరింటాకు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు చేతులకు మైదాకు పెట్టుకొని మురిసిపోయారు. గోరింట విశిష్టత వివరించారు.

రైతాంగాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

కరీంనగర్: రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను, రైతాంగాన్ని మోసం చేస్తోందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విడతల వారీగా రుణమాఫీ చేస్తూ ఏకకాలంలో చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం ఏకకాలంలో రుణమాఫీ అంటుంటే మంత్రులు మూడు విడతల్లో అని చెప్పడం చూస్తుంటే సీఎం మాటలకు మంత్రుల మాటలకు పొంతన లేకుండా ఉందని తెలిపారు. తమ పార్టీ పాలనలో నాలుగు విడతల్లో చేస్తామని చెప్పి చేసి చూపించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం రుణమాఫీపై చేసి డిసెంబర్ 9లోగా మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. రైతు భరోసాకు తిలోదకాలు ఇచ్చేందుకే రుణమాఫీని తెరపైకి తీసుకొచ్చారన్నారు. మోసపూరితమైన కాంగ్రెస్ పార్టీ పాలకులు బీఆర్‌ఎస్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 4 వేల పింఛన్, తులం బంగారం, చేయూత పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు అలుపెరుగని పోరాటం చేస్తామని తెలిపారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న హెచ్‌ఎం సరిత

జమ్మికుంట: చదువుకునే విద్యార్థులపై ఇంటి వద్ద తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సరిత సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ప్రైమరీ(బీపీఎస్) పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. క్రమశిక్షణ, చదువు, విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించాలన్నారు. సదానందం, వెంకన్న, రజిత, విశాలి పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

చిగురుమామిడి: బడికి వెళ్లే పిల్లలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా లేబర్ ఆఫీసర్ చక్రధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం చిగురుమామిడిలోని హోటళ్లు, కిరాణదుకాణాలను తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 1నుంచి ఆపరేషన్ ముస్కాన్ పేరుతో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. పది బృందాలుగా ఏర్పడి బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు వివరించారు. బాలకార్మికులను పనిలో చేర్చుకున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఆర్ ఎస్సై కరీం, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ విజయసాగర్ పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌ను కలిసిన సొల్లు బాబు



హుజూరాబాద్: సుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొల్లు బాబు జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కేకేను కలిసిన నాయకులు

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన కె.కేశవరావును హైదరాబాద్‌లో జమ్మికుంట పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, సీనియర్ నాయకుడు పొనగంటి మల్లయ్య శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఆరెపల్లి మోహన్, వకుళభరణం కృష్ణమోహన్‌రావు, పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

మొక్కలు పంపిణీ

జమ్మికుంట: కొత్తపల్లిలోని 20వ వార్డులో వన మహోత్సవంలో భాగంగా కౌన్సిలర్ దేశిని రాధసదానందం ఆధ్వర్యంలో శనివారం మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. చెట్ల పెంపకం వల్ల ఉపయోగాలను వివరించారు. ఆర్‌పీ సృజన, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ


చొప్పదండి: బోనాలతో విద్యార్థినులు

చొప్పదండి: పట్టణంలోని విద్యార్థులు శనివారం ఆషాఢం బోనాల పండుగను నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేషధారణలతో ఆకట్టుకున్నారు. పోతురాజుల వేషధారణ, సంప్రదాయ వస్త్రధారణతో బోనాలను ఎత్తుకొని మొక్కులు సమర్పించారు. వీణాధరి విద్యాలయం కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధర: రంగరావుపల్లి గ్రామంలోని ఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో శనివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఇన్‌చార్జి తిరుపతి బోనాల ప్రాధాన్యం వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


భూపాలపట్నంలో ఉపాధ్యాయులకు సన్మానం

చొప్పదండి: భూపాలపట్నం గ్రామ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో కొన్నేళ్లు బోధన చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. సముద్రాల అంజయ్య, చొప్పదండి పద్మను విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎండీ మొహియుద్దీన్, కృష్ణమూర్తి, వెంకటరమణ, శ్యాంసుందర్, ఉమాదేవి, సుజాత, సీఆర్‌పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాజు(ఫైల్)

జమ్మికుంట: మడిపల్లి గ్రామానికి చెందిన ఒల్లాల రాజు(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. స్వగ్రామంలో శనివారం విషాదం నెలకొంది. గ్రామస్తులు, బంధువుల వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెంగుట్ట గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో రాజు మేనేజ్‌మెంట్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం గూడెంగుట్ట గ్రామం వద్ద బైక్‌పై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శారద, ఇద్దరు పిల్లలున్నారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అనారోగ్యంతో..

ఇల్లందకుంట: మల్యాల గ్రామానికి చెందిన ఇనుగాల రామస్వామి(37) అనే వ్యక్తి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య సంధ్య, కూతురు ఉన్నారు. కొన్ని రోజుల నుంచి వీణవంక మండలం గంగారం గ్రామంలో నివాసముంటున్నాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సైదాపూర్: ఎలబోతారం గ్రామానికి చెందిన ములుగు లక్ష్మి(70) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఆరోగ్యం శనివారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మృతురాలు కొంతకాలంగా బీపీ, షుగర్, నరాల బలహీనత వ్యాధులతో బాధపడుతూ మనోవేదనకు గురైంది. శుక్రవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి అక్కడే పురుగుల మందు తాగింది. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అదేరోజు మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు

జమ్మికుంట: డబ్బులు తీసుకొని తిరిగివ్వకుండా బెదిరిస్తున్న ఇద్దరిపై కోర్టు ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి శనివారం తెలిపారు. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన బాసని పాపిరెడ్డి అనే వ్యక్తి తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రాజు అనే ఇద్దరు వ్యక్తులు కాంట్రాక్ట్ పని ఇస్తామని నమ్మించి రూ.82లక్షలు తీసుకున్నారని, పని అప్పగించకుండా డబ్బులు తిరిగివ్వకుండా చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును వివరణ కోరగా.. తప్పుడు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారని, డబ్బులు తీసుకోలేదన్నారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చొప్పదండి: పట్టణ ప్రజలు ప్రస్తుత వర్షాల సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పూర్తి కాని పంచాయతీ భవనాలు

- తొమ్మిదింటిలో నాలుగు పూర్తి
- రెండు పైకప్పు స్థాయిలో..
- మూడింటికి స్థలాల్లేక..
- పట్టించుకోని అధికారులు


కొండాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న జీపీ కార్యకలాపాలు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు గాను గత ప్రభుత్వం తొమ్మిది గ్రామాలకు నూతన పంచాయతీ భవనాలను మంజూరు చేసింది. 2023 సెప్టెంబర్ 9న ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20లక్షలు మంజూరు చేసింది. కొండాపూర్, ఓగులాపూర్, లంబాడిపల్లి, పీచుపల్లి, గునుకులపల్లి, గాగిరెడ్డిపల్లి, నవాబుపేట్, సీతారాంపూర్ గ్రామాలకు నిధులు మంజూరు చేయగా.. వీటిలో ఐదు ప్రగతిలో ఉన్నాయి. రెండింటిని నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడంలేదు. దీంతో పాత భవనం, అద్దె భవనంలో కార్యకలాపాలు సాగిస్తున్నారు.

నిలిచిన పనులు

కొత్తగా మంజూరైన భవనాల్లో కొండాపూర్‌లో పాత భవనం శిథిలావస్థకు చేరగా.. అదే గ్రామంలో మరో భవనాన్ని అద్దెకు తీసుకొని పాలన సాగిస్తున్నారు. స్థలం కావాల్సినంత ఉన్నా.. కాంట్రాక్టర్ కట్టేందుకు ముందుకు రావడం లేదు. ఓగులాపూర్‌లో పాత భవనం ఇరుకైన స్థలంలో నిర్మించారు. దాన్ని కూల్చి కొత్తగా కట్టాలంటే నిర్ణీత కొలతలకు స్థలం సరిపోక పంచాయతీ భవన నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఓగులాపూర్ గ్రామంలో రిజర్వాయర్ కింద ముంపునకు గురైనందున ప్రభుత్వ ఆధీనంలో ఉంది. స్థలం కొనుగోలుకు వీల్లేకుండా పోయింది. ఉన్నదాంట్లో సరిపెట్టుకోవాలే తప్ప కొత్త భవనాన్ని నిర్మించేందుకు వీల్లేకుండా ఉంది. పీచుపల్లిలో కూడా కావాల్సినంత స్థలం లేక నూతన పంచాయతీ భవనం పనులు నిలిచిపోయాయి.

నిర్మాణ దశలో..

సీతారాంపూర్, నవాబుపేట్, ముదిమానిక్యం, గునుకులపల్లె గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలు పైకప్పు స్థాయిలో ఉన్నాయి. పూర్తయ్యేందుకు సమయం పట్టే అవకాశముంది. గాగిరెడ్డిపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాలు పూర్తయ్యాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభోత్సవం చేశారు. అప్పటి నుంచి కొత్త భవనాల్లో పంచాయతీల పాలన సాగుతోంది.

తనిఖీ చేయని అధికారులు

ఐదు భవనాలకు గాను రెండు పూర్తి కాగా.. మిగిలిన మూడింటి పనులను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంది. కాని మండల, జిల్లా పంచాయతీ అధికారులు భవనాల నిర్మాణాల పనులను తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సరిపోని నిధులు

కేంద్ర ప్రభుత్వం నూతన జీపీల నిర్మాణానికి గాను మంజూరు చేసిన రూ.20లక్షల నిధులు సరిపోవడం లేదనే ఆరోపణలు కాంట్రాక్టర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. మరో రూ.6లక్షల నుంచి రూ.8లక్షలు మంజూరు చేస్తే తప్పా.. పూర్తి స్థాయిలో పనులయ్యే పరిస్థితుల్లేవని అంటున్నారు. నిధులు మంజూరు కావాలంటే పంచాయతీ పాలకవర్గాల్లేవు. వాటి పదవీకాలం పూర్తయింది. గ్రామ ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించి నిధుల ఆమోదం పొందితే తప్పా.. నిధులు మంజూరయ్యే అవకాశాల్లేవు.

పర్యవేక్షిస్తున్నాం..

తొమ్మిది పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు కాగా.. దాదాపు ఆరు పూర్తయ్యాయి. మిగిలిన మూడు పంచాయతీ భవనాలకు స్థలాల్లేవు. నాణ్యతా ప్రమాణాలకు తగినట్లుగానే పనులు జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– శ్రవణ్‌కుమార్, పంచాయతీ అధికారి, చిగురుమామిడి మండలం

జీఎస్టీ లైసెన్స్ తీసుకోవాలి

హుజూరాబాద్: వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా జీఎస్టీ లైసెన్స్ కలిగి ఉండాలని వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.